
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 23 సెప్టెంబరు 2025



శైలపుత్రి అలంకారంలో అమ్మవారు

భృంగి వాహనంపై శివపార్వతులు





- శైలపుత్రిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- శ్రీగిరిలో ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

శ్రీశైలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ మహాశక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమివ్వగా... ఆదిదంపతులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి భృంగి వాహనంపై విహరించారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలోని యాగశాల ప్రవేశంతో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతిపూజ, దీక్షా సంకల్పం నిర్వహించి, అఖండదీపస్థాపన, వాస్తుపూజ, చండీకలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహజపాలు, పారాయణలు నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి యాగశాలలో యాగశాలప్రవేశం, గణపతిపూజ, శివసంకల్పం తదితర వేడుకలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని వేదపండితులు, అర్చకులు సంకల్పాన్ని పఠించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా కుమారిపూజలు నిర్వహించారు. ఈ కుమారి పూజలో భాగంగా రెండు సంవత్సరాలు నుంచి పది సంవత్సరాలలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు.

శైలపుత్రిగా అమ్మవారి రూపం

తొలిరోజు భ్రమరాంబికా అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శైలపుత్రి అలంకారంలో అమ్మవారు ద్విభుజాలను కలిగి కుడి చేతిలో త్రిశూలం, ఎడమ చేతిలో పద్మం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భృంగివాహనంపై స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. రెండో రోజు మంగళవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిస్తారు. సాయంత్రం మయూర వాహనంపై శివపార్వతులు విహరిస్తారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు : దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం తిరుపతికి చెందిన అముదాల మురళి నిర్వహించిన దేవీ భాగవతం, ప్రకాశం జిల్లా టి.బాల యోగి బృందం ఆధ్వర్యంలో భక్తరంజని కార్యక్రమాలు అలరించాయి.





గ్రామోత్సవంలో కళారూపాలు

భవనాశిపై నిర్లక్ష్యమేలా...!



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి వాగు (ఫైల్)

భవనాశి నదిపై దశాబ్దాలుగా పాలకులు, అధికారుల చిత్తశుద్ధి సన్నగిల్లుతోంది. నది ఉగ్రరూపం దాలిస్తే రెండు మండలాల ప్రజలు పడే కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లాలన్నా ఆటంకాలు తప్పడంలేదు. జిల్లాలోని అహోబిలం పుణ్యక్షేత్రంలో నల్లమల పర్వతసానువుల నడుమ ఉద్భవించిన భవనాశి నది పలు మండలాలు దాటుతూ తూర్పు నుంచి పడమరకు ఆత్మకూరు పట్టణ శివారు మీదుగా ప్రవహిస్తూ కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలోని కృష్ణానదిలో కలుస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో ఒట్టికుండలా దర్శనమిచ్చే భవనాశిని వరదల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాల సమయంలో ఉధృతంగా ప్రవహించడంతో ఆత్మకూరు నుంచి పలు గ్రామాలతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు రాకపోకలు సాగించలేని పరిస్థితులు. తప్పని పరిస్థితుల్లో వంతెన ప్రయత్నం చేస్తే.. ప్రాణాలు గాల్లో దీపాల్లా మారే ప్రమాదం లేకపోలేదు.

- దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య
- వరదలతో పొంచివున్న ముప్పు
- ఊసే లేని వంతెన నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న భవనాశి వరద సమస్యకు పరిష్కారం లభించేనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొన్నేళ్లుగా భవనాశి పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైంది. అలాగే ప్రవాహ మార్గంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి పూడిక ఏర్పడింది. దీంతో వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వరద సమయాల్లో వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈక్రమంలోనే వరద నీరు సమీప పొలాల్లోకి చేరి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ఇప్పటికే పలు సందర్భాల్లో భవనాశి నది ఉప్పొంగి వందలాది ఎకరాల పొలాలు నీట మునిగాయి.



కొత్తపల్లి - ఆత్మకూరు రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

శిథిలావస్థకు చేరుకున్న వంతెన



ప్రస్తుతం వున్న వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో భవనాశిపై ఎత్తులో వంతెన నిర్మాణం చేపట్టడమే కాకుండా నది ప్రవాహంలో ఉన్న పూడికను తొలగించాల్సిన అవసరం ఉంది. గతంలో భవనాశి వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ ఆ తర్వాత ఆఊసే లేకుండా పోయింది. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వాధికారులు స్పందించి భవనాశి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆశిద్దాం.

పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం

ఆత్మకూరు పట్టణం నుంచి మండలంలోని కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి, సప్తనదుల సంగమేశ్వర క్షేత్రాలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయాల్లో ఎవరైనా వంతెన దాటేందుకు ప్రయత్నిస్తే వరద ఉధృతికి కొట్టుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఈ ఏడాది నాలుగు సార్లు..

నాలుగైదేళ్లలో ఎప్పుడో ఒకసారి మాత్రమే భవనాశి నది ఉప్పొంగి ప్రవహించేది. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే నాలుగు సార్లు భవనాశికి వరద వచ్చింది. ఈఏడాది కురిసిన భారీ వర్షాలతో వరదరాజ స్వామి ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ గేట్లు తెరిచినప్పుడల్లా ఆ నీరంతా భవనాశిలోకి చేరి ఉప్పొంగి ప్రవహించడంతో ఈ సమస్య నెలకొన్నట్లు తెలిసింది.

వరదొస్తే రాకపోకలు బంద్



భవనాశి నదికి వరదొచ్చి ఉప్పొంగి ప్రవహిస్తే తమ గ్రామం నుంచి ఆత్మకూరుకు రాకపోకలు బంద్ అవుతాయి. అనేక సందర్భాల్లో వరద ఉధృతితో రోజుల తరబడి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

● శంకర్‌గుప్తా, కురుకుంద, ఆత్మకూరు మండలం

వంతెన నిర్మాణం చేపడితేనే..



భవనాశి నదికి వరదలొచ్చి ఉధృతంగా ప్రవహిస్తే ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. భవనాశి నదిపై ఎత్తులో వంతెన నిర్మాణం చేపడితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం.

● గంగన్న, గుమ్మడాపురం, కొత్తపల్లి మండలం

2012 సెప్టెంబరు 2వ తేదీన..

2012 సెప్టెంబరు 2వ తేదీన భవనాశి ఉప్పొంగిన సమయంలో కురుకుంద గ్రామానికి చెందిన బాషా, ఉదయ్‌కుమార్ అనే విద్యార్థులు వాగు దాటేందుకు ప్రయత్నించి గల్లంతయ్యారు. వీరిలో ఉదయకుమార్ అనే విద్యార్థిని అప్పటి ఆత్మకూరు ఎస్సై శ్రీహరి రక్షించగా బాషా అనే బాలుడు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 18న కురుకుంద గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వంతెన దాటే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో బైక్‌తో సహా ముగ్గురు నీటిలో కొట్టుకుపోగా స్థానికులు రక్షించారు. వరద సమయాల్లో భవనాశి నది దాటేందుకు పోలీసులు ఎవరిని అనుమతించరు.



భవనాశి నదీ ప్రవాహంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు

ప్రభుత్వ వైద్యుల సమ్మెబాట



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ప్రభుత్వ వైద్యులు సమ్మెకు సన్నద్ధమయ్యారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణకు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ అసోసియేషన్ తరపున డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, సెక్రటరి వై.అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలన్నారు. టైమ్‌బౌండ్ ప్రమోషన్లు అమలుచేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు బేసిక్ పే 50శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరుచేయాలన్నారు. అలాగే నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుచేయాలన్నారు. చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద వైద్యులకు రూ.5వేల అలవెన్స్ ఇవ్వాలన్నారు. నేటివిటి, అర్బన్ అర్హత సమస్యలను పరిష్కరించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలన్నారు. అనధికార వ్యక్తులు పీహెచ్‌సీలను విచ్చలవిడిగా పర్యవేక్షించకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం కాలేదని, అందువల్ల సమ్మెకు దిగక తప్పనిపరిస్థితి ఏర్పడిందన్నారు. తమ నిరసన ప్రజలపైకాదని ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమేనని గమనించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించకపోతే గురువారం నుంచి సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు.

భూసేకరణ ప్రతిపాదనలు పంపండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతిగృహాలు, రోడ్లు భవనాల నిర్మాణం వంటి పనులకు అవసరమైన భూసేకరణకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాల్‌లో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరమవుతుందో సంబంధిత శాఖలు స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. ప్రాజెక్టుల వారీగా భూములను సిద్ధంచేయడంలో ఆలస్యం జరిగితే సంబంధిత శాఖలపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. భూ సేకరణకు సంబంధించి పబ్లిక్‌హెల్త్ శాఖకు ఆళ్లగడ్డ, నందికొట్కూరులలో ఎస్టీపీసీ ప్రాజెక్టు, యూఐడీఎఫ్ స్కీం కింద 2ఎకరాలు, గృహనిర్మాణాలకు పట్టణ ప్రాంతాల్లో వంద ఎకరాలు, బనగానపల్లెలో ఎంజేపీ స్కూల్, ఆళ్లగడ్డ పట్టణంలో బాలుర వసతిగృహానికి 50సెంట్లు, బాలికల వసతిగృహానికి 50సెంట్లు, నంద్యాల పట్టణంలోబీసీ భవన్‌కు 50సెంట్లు, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, శ్రీశైలంలోని ఆరు సంక్షేమ వసతిగృహాలకు 50సెంట్ల చొప్పున అవసరమని అధికారులు సూచించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఖజానా శాఖకు ఆర్థిక సమీకృత భవనానికి 50 సెంట్లు, ఔట్‌డోర్ స్టేడియానికి 15ఎకరాలు, నియోజకవర్గాల్లోని పశువుల వసతిగృహాలకు అవసరమైన భూములు, డోన్, ఆళ్లగడ్డలో వంద పడకల ఆస్పత్రికి 2ఎకరాలు చొప్పున, పిన్నాపురం, యు.బొల్లవరం, బిళ్లలాపురం, కానాల స్కూళ్లకు 5ఎకరాల చొప్పున, అల్లూరులో రెసిడెన్షియల్ హాస్టల్‌కు 10ఎకరాలు అవసరమని సంబంధిత శాఖలు సూచించిన నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 220 దరఖాస్తులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత కాలంలో పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 220 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అధికారులు జవాబుదారితనంతో మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీదారులకు సరైనరీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోవడంవల్లే అసంతృప్తిస్థాయి పెరిగి జిల్లా ర్యాంకింగ్‌లో వెనుకబడిపోతున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న రీ ఓపెన్ దరఖాస్తులన్నీ వారం రోజుల్లోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జిగా వైకుంఠం జ్యోతి

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- వీరభద్రగౌడ్‌ను బాధ్యతల నుంచి తప్పించిన అధిష్ఠానం



నారా లోకేశ్‌తో వైకుంఠం జ్యోతి, ప్రసాద్ (ఫైల్)

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా ఆలూరు ఇన్‌చార్జిని మార్పు తథ్యం అంటూ జరుగుతున్న చర్చకు అధినేత చంద్రబాబు తెర దించారు. కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇన్‌చార్జిగా కొనసాగిన వీరభద్ర గౌడ్‌ను బాధ్యతలను టీడీపీ తప్పించింది. టీడీపీ ఆలూరు నియోజకర్గం సారథిగా ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ ఎంపీపీ వైకుంఠం ప్రసాద్ సతీమణి వైకుంఠం జ్యోతిని అధిష్ఠానం నియమించింది. 2015 నుంచి టీడీపీ ప్రత్యక్ష రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆమె గత ఎన్నికల్లో ఆలూరు టికెట్ ఆశించారు. ఈ క్రమంలో ఆమెను ఆలూరు ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో నియోజకవర్గంలో వైకుంఠం వర్గీయులు, టీడీపీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. వర్గవిభేదాలకు తావు లేకుండా అధిష్ఠానం అదేశాల మేరకు అందరిని కలుపుకుంటూ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఇన్‌చార్జిగా నియమితులైన వైకుంఠం జ్యోతి వెల్లడించారు. వర్గవిభేదాలు వీడి అందరిని కలుపుకొని పార్టీ బలోపేతం కోసం పని చేయాలని వీరభద్రగౌడ్ అధిష్ఠానం పలు అవకాశాలు ఇచ్చినా ఆయనలో మార్పు కనిపించలేదని టీడీపీ భావించింది. ఆయన ఒంటెత్తుపోకడ వల్ల పార్టీకి తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని గుర్తించిన అధిష్ఠానం నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ముఖ్య నాయకులు అంటున్నారు.

మిగతా 6 పేజీ తరువాయి

సమస్యలను పరిష్కరించాలి
నంద్యాల ఎస్పీ సునీల్‌షెరాన్ 6

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం 7



మహానందిలో శైలపుత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరీదేవి


బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి


శైలపుత్రీ దేవిగా నందవరం చౌడేశ్వరీమాత


చిన్న అమ్మవారిశాలలో..


బిర్లా కంపౌండ్ దేవనగర్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహం

ఘనంగా ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని దేవీ ఆలయాలు, శైవక్షేత్రాల్లో ఈ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఉదయం వేకువ జాము నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, హోమాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి వివిధ ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. కర్నూలు నగరంలో వందలాది సంఖ్యలో దుర్గామాత విగ్రహాలను కొలువుదీర్చారు.

● కర్నూలు నగరంలోని మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పూలబజార్‌లోగల చిన్న అమ్మవారిశాలలో బాల త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

● గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో కొలువైన సుంకులాపరమేశ్వరి అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

● బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత తొలిరోజు శైలపుత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

మహానందిలో శైలపుత్రి దుర్గగా కామేశ్వరీదేవి

మహానంది: మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను సోమవారం ఆలయ వేదపండితులతో పాటు ప్రత్యేక రుత్వికులు ఘనంగా ప్రారంభించారు. కామేశ్వరీదేవి ఆలయంలో తెల్లవారుజామున విశేష ద్రవ్య అభిషేకం, నవరాత్రి అర్చన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచాంగవ్యప్రాశన, రుత్వికరుణ, దీక్షాధారణ, అఖండ దీపాస్థాపన, కలశస్థాపన, శ్రీచక్ర నవావరణార్చనలతో ప్రారంభించారు. సాయంకాలం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవలతో పాటు అమ్మవారిని శైలపుత్రి దుర్గగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. మయూర వాహనంపై అమ్మవారు విహరించారు.

మహిళలకు అండగా వనస్టాప్ సెంటర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు వనస్టాప్ సెంటర్ అండగా ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం వన్ స్టాప్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వన్‌స్టాప్ సెంటర్ - మిషన్ శక్తి ద్వారా గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలికలపై లైంగిక వేధింపులు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు వంటి సందర్భాల్లో బాధిత మహిళలకు చట్టపరమైన వైద్య, మానసిక, సలహా, పునరావాస సహాయం అందుతుందని తెలిపారు. మహిళలు, బాలికలు తక్షణ సహాయం కోసం స్థానిక వన్‌స్టాప్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని, బాధిత మహిళలు మౌనంగా భరించకుండా ముందుకు వచ్చి సహాయం పొందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.నవ్య, ఐసీడీఎస్ పీడీ పి.విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భద్రతకు ప్రత్యేక చర్యలు

● ఆక్టోపస్ డీఎస్పీ జగ్గునాయుడు


మహానంది ఆలయంలో అర్ధరాత్రి వేళలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ కమాండోలు

మహానంది, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆక్టోపస్ డీఎస్పీ జగ్గునాయుడు తెలిపారు. మహానంది క్షేత్రంలోని పరిసరాల్లో ఆదివారం అర్ధరాత్రి ఆక్టోపస్ కమాండోలు మాక్ డ్రిల్ నిర్వహించారు. అంతకముందు దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కేఎస్ఎస్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. ఆలయంతో పాటు ముఖ్యమైన భవనాలపై ఉగ్రవాదులు దాడులు చేసినప్పుడు ప్రణాళిక ప్రకారం ఎలా స్పందించాలనే అనే అంశాలపై డీఎస్పీ శిక్షణ ఇచ్చారు. అనంతరం అర్ధరాత్రి 1.30 గంటల వరకు మహానంది ఆలయంలో ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఫైర్ ఆఫీసర్ రఘునాథ్, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి భగవాన్‌దాస్, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైల డ్యాంలో 206 టీఎంసీల నీరు

● దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల


10 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 206 టీఎంసీలుగా నమోదు అయింది. సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి నీటిమట్టం 883 అడుగులుగా ఉంది. వరద ప్రవాహం పెరగడంతో ఇంజనీర్లు పదిగేట్లను 12 అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే గుండా 3,12,260 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు సాగనంపుతున్నారు. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 2,81,792 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,365 క్యూసెక్కులు విడుదల చేశారు.

6 నుంచి మహిళలకు శిక్షణ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(ట్రైనీ)పై శిక్షణ ఇస్తున్నట్లు నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికార కేంద్రం జిల్లా మేనేజర్ అంజలి భూషణ్ తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టుకు 60 రోజులు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌కు 60 రోజుల శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ అనంతరం వివిధ రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. హాస్టల్ వసతి కూడా ఉంటుందని తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు నగరంలోని మహిళా సాధికార కేంద్రం (మహిళా ప్రాంగణం)లో సంప్రదించాలన్నారు.

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జిగా వైకుంఠం జ్యోతి

5వ పేజీ తరువాయి

జ్యోతి ఎదుట సవాళ్లు..!

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన వైకుంఠం జ్యోతి ఎదుట పార్టీ అంతర్గతంగా పలు సవాళ్లు ఉన్నాయి. నియోజకవర్గంలో టీడీపీకి బలమైన కార్యకర్తలు, నాయకత్వం ఉన్నా.. వర్గవిభేదాలు వల్ల పార్టీ ఓటమి చెందుతూ వస్తోంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1983 నుంచి 2024 వరకు ఉప ఎన్నికతో కలిపి 11 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 1983, 1987 (ఉప ఎన్నిక), 1994 ఎన్నికల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. గత 30 ఏళ్లుగా అక్కడ టీడీపీ జెండా ఎగరలేదు. టీడీపీలో వైకుంఠం, కోట్ల, వీరభద్రగౌడ్, గుమ్మనూరు వర్గాలు బలంగా ఉన్నాయి. వీరితో పాటుగా దివంగత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆయన కుమార్తె, ఏపీ వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ కూడా తన వర్గాన్ని బలపేతం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ 2029 ఎన్నికల్లో ఆలూరులో పసుపు జెండా ఎగురవేసే దిశగా పార్టీని బలోపేతం చేయడం వైకుంఠం జ్యోతికి కత్తిమీద సాములాంటిదే అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం



మా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నాపై ఎంతో నమ్మకంతో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వారి నమ్మకాన్ని తప్పకుండా నిలబెడుతాను. నాకు వర్గాలతో సంబంధం లేదు. అధినేత చంద్రబాబు, అధిష్టానం నిర్ణయాలే నాకు శిరోధార్యం. అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా ముందు వెళ్తాను. టీడీపీ జెండా మోసిన ప్రతి కార్యకర్త అభ్యునతి కోసం కృషి చేస్తాను. అన్ని వేళల వారికి అండగా ఉంటాను. అందరిని సమన్వయం చేసుకుంటూ 2029లో ఆలూరులో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేస్తాను. కార్యకర్తలు, మండల నాయకులు స్వేచ్ఛగా నన్ను కలసి తమ సమస్యలు చెప్పుకోవచ్చు. ఆలూరు నియోజకవర్గాన్ని పట్టి పీడిస్తున్న వలసలు, తాగునీటి సమస్య నివారణకు కృషి చేస్తాను. ఆ సమస్యలు తీరాలంటే వేదావతి ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రథమ లక్ష్యం. తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చేందుకు సంపూర్ణ సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. బడుగు వర్గాల అభ్యునతి కోసం పరితపించే మా మామ దివంగత కేడీసీసీబీ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు ఆశయాలను నెరవేరుస్తా.

- వైకుంఠం జ్యోతి, టీడీపీ ఇన్‌చార్జి, ఆలూరు

'విజయవాడ ఉత్సవ్'కు 'జగదేక సుందరి సామా' నాటకం ఎంపిక


'జగదేక సుందరి సామా' నాటకంలోని ఒక దృశ్యం (ఫైల్)

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'కు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారుల చారిత్రక పద్య నాటకం 'జగదేక సుందరి సామా' ఎంపికైంది. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ చొరవతో విజయవాడలో జరిగే వేడుకల్లో సామా నాటకం ఎంపికైనట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 29న రాత్రి 8 గంటలకు రాష్ట్ర మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు, సినీ, నాటక కళాకారుల సమక్ష్యంలో తమ నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ నగరంలో గల కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 25న 'సామా' నాటకం ప్రదర్శిస్తున్నామని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా తెనాలిలో వీణ అవార్డుల కోసం నిర్వహించే ఉమ్మడి రాష్ట్రస్థాయి నాటక పోటీల్లోనూ ఈనెల 30న సామా నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఇటీవల అనంతపురంలోని సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్, అమరావతి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి రాష్ట్రస్థాయి నాటక పోటీల్లోనూ టీజీవీ కళాక్షేత్రానికి ప్రథమ బహుమతి, 4 వ్యక్తిగత బహుమతులు వచ్చాయని తెలిపారు. ఈ నాటకం సెప్టెంబర్ మాసంలో రాయలసీమ, తెలంగాణ, ఆంధ్ర మూడు ప్రాంతాల్లో ప్రదర్శనకు నోచుకోవడం విశేషమని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి : నంద్యాల ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ సునీల్‌షెరాన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 95 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

వైద్యవిద్యలో సామాజిక దృక్పథం అవసరం

● కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ



ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య పూర్తి చేయాలంటే దృఢసంకల్పంతో పాటు సామాజిక దృక్పథం అవసరమని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. 2025-26 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాలేజీలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో మెడిసిన్ సీటు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో ఉన్నతమైందని, రోగుల ప్రాణాలను కాపాడేదని ఈ కోర్సులో సామాజిక దృక్పథం ఎంతో అవసరమన్నారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించడం అంటే ఎంతో గొప్ప విషయమని వైద్యవిద్యలో ప్రతి రోజు విలువైనదేనన్నారు. ఎంబీబీఎస్ పూర్తయ్యేంత వరకు ప్రతి రోజు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ హరిచరణ్, సాయిసుదీర్, రేణుకాదేవి, బి.విజయానందబాబు, సింధియా శుభప్రద, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్, కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ పృథ్వి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆమె కత్తికి పదునెక్కువ

● అనతికాలంలోనే అంతర్జాతీయ స్థాయికి
● కూచిపూడి, ఫెన్సింగ్ క్రీడల్లో రాణిస్తున్న తన్మయిశ్రేయ
● ఆసియా ఫెన్సింగ్ పోటీల్లో భారత్ జట్టుకు ప్రాతినిధ్యం

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆమె కత్తికి పదునెక్కువ. కత్తిపట్టి బరిలోకి దిగిందంటే ప్రత్యర్థి చిత్తవ్వాల్సిందే. అనతికాలంలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన పబ్బతి చిన్మయిశ్రేయ విజయప్రస్థానమిది. రెండేళ్లనుంచి నంద్యాల పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో శిక్షకుడు లక్ష్మణ్ శిక్షణలో ఫెన్సింగ్‌లో మెలకువలు నేర్చుకుంది. ఈపీ విభాగంలో తన్మయిశ్రేయకు ఎదురులేదు. ఆడిన ప్రతి టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధిస్తూ దూసుకుపోతోంది. నంద్యాల్లోని ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న చిన్మయిశ్రేయ త్వరలో ఆసియా ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. తల్లిదండ్రులు పబ్బతి వేణు, అరుణలకు ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలను క్రీడల్లో ప్రోత్సహించడంతో లక్ష్యాలను అధిగమిస్తూ దూసుకెళుతున్నారు. రెండవ కూతురు తన్మయిశ్రీయ ఫాయిల్ విభాగంలో ఫెన్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించింది. అక్కాచెల్లెళ్లు అటు ఫెన్సింగ్‌లో, ఇటు కూచిపూడిలో రాణిస్తూ బాలికలకు స్ఫూర్తిగా నిలిచారు. ఫెన్సింగ్ పోటీల్లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో బంగారు పతకాలు సాధిస్తూ నంద్యాల జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నారు. ఇటీవల మహిళా దినోత్సవం రోజు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అవార్డును అందజేసి తన్మయిశ్రేయను అభినందించారు. రానున్న ఆసియా ఫెన్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి దేశానికి పతకం సాధించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. కూచిపూడి మాస్టర్ చందన్ శిక్షణలో విశాఖపట్టణం, టీటీడీ మండపాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.


పబ్బతి తన్మయి శ్రేయ

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో

● 2024లో కేరళ రాష్ట్రం కన్నూరులో జరిగిన జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం
● 2024లో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం
● ఉత్తరాఖండ్ హల్ద్వానిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం
● ఆసియా కప్ క్వాలిఫైంగ్ పోటీల్లో అర్హత సాధించి ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం



తన్మయిశ్రేయ సాధించిన పతకాలు

● ఈపీ 2024లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా టోర్నమెంట్‌లో బంగారు పతకం.
● రాష్ట్ర స్థాయి అండర్-14స్కూల్‌గేమ్స్ టీమ్ విభాగంలో బంగారు పతకం
● విజయవాడలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి వ్యక్తిగత విభాగంలో వెండి పతకం
● అండర్-14జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో బంగారు పతకం
● రాష్ట్ర స్థాయి అసోసియేషన్ అండర్-14వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో బంగారు పతకం
● 2025లో అండర్-17కేడెట్ విభాగంలో జిల్లా స్థాయిలో బంగారు పతకం
● భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో బంగారు పతకం


కలెక్టర్‌తో అవార్డు అందుకుంటున్న తన్మయిశ్రేయ (ఫైల్)

గుడికల్లు చెరువులో మృతదేహం



హరీఫ్‌బాషా (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు చెరువులో ఆదోని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు ఆదోనికి చెందిన హరీఫ్ బాషా(33) ఆదోనిలోని హెచ్.పీ పెట్రోలు బంకులో పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో గత కొన్నినెలలుగా బాధపడుతూ ఉండేవాడని తెలిపారు. అయితే 11వ తేదీ ఇంటి నుంచి బయటకు వచ్చాడని, 15వ తేదీన ఆదోనిలోని పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందన్నారు. హరీఫ్‌బాషా ద్విచక్రవాహనం ఎమ్మిగనూరులోని బస్టాండ్‌లో ఉండడంతో ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల్లో ఉండి ఉంటారని పోలీసులు గాలింపు చేపట్టారు. అయితే గుడిక ల్లు చెరువులో సోమవారం హరీఫ్‌బాషా మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. భార్య షబానా ఇచ్చి న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాముకాటుకు వ్యవసాయ కూలీ మృతి

బనగానపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని యనకండ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రమాదేవి (38) అనే వ్యవసాయ కూలీ కైప గ్రామంలో పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేయడంతో మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం రమాదేవిని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

గడివేముల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి వివరాల మేరకు..మండలంలోని దుర్వేసి గ్రామానికి చెందిన మంజూతో నంద్యాల మండలం పోలూరు గ్రామానికి చెందిన మనోహర్ (32) వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడు రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడటంతో భార్య మంజూ తన పుట్టింటికి వచ్చింది. ఆదివారం చాకలి మనోహర్ గ్రామానికి వచ్చి తన భార్యను కాపురానికి రమ్మని పిలువగా ఆమె నిరాకరించింది. దాంతో మనస్తాపానికి గురై బాత్రూమ్‌లో విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని మీర్జాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మొట్టె రంగస్వామి (48) చాలా కాలంగా మద్యానికి బానిసగా మారాడు. సోమవారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు.

టైర్ పేలి వాహనం బోల్తా

● ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన వాహనం

డోన్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డోన్ సమీపంలోని కర్నూలు-బెంగుళూరు జాతీయ రహదారిపై కదిరి వైపు వెళ్తున్న ఓ వాహనం వెనుక టైరు పేలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి స్పందించి తమ పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని బయటకు తీసి రక్షించారు. అనంతరం వాహనం రోడ్డు సైడుకు పంపించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయాలపాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సకాలంలో పోలీసులు స్పందించడంతో వారి కృషిని ప్రజలు కొనియాడుతూ ధన్యవాదాలు తెలిపారు.

ఉల్లి రైతుల ఉసురు తగులుతుంది

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుల జీవితాలతో ఆడుకుంటోందని, రైతుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కోడుమూరు మండలంలోని వెంకటగిరి వద్ద ఉల్లి పంటలను ఎస్వీ, కుడా మాజీ ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉల్లిరైతుల గోడు విన్నారు. ఉల్లిసాగును నమ్ముకుని అప్పులుచేశామని రైతులు ఆవేదన చెందారు. అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అనంతరం ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్ధతు ధరతో ఉల్లి కొంటామని మధ్యలో చేతులెత్తేసిందని మండిపడ్డారు. జిల్లాలో సాగైన పంటలో కేవలం 5 శాతం మాత్రమే కొన్నారని తెలిపారు. పవన్ కల్యాణ్ సినిమాకు టికెట్ రూ.వెయ్యి, అదే రైతు పండించిన ఉల్లి మాత్రం క్వింటా రూ.100 అని ఎద్దేవ చేశారు. ప్రభుత్వ పరిహారం హెక్టారుకు రూ.50 వేలు ఏమాత్రం సరిపోదన్నారు. ఉల్లికి కనీస మద్ధతు ధర రూ.2 వేలు ప్రకటించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు అధికారి మృతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి చెన్నమ్మ సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై శ్రీచక్ర హాస్పిటల్‌కు ఎదురుగా జరిగిన ప్రమాదంలో బ్యాంకు అధికారి సురేంద్రగౌడు (40) దుర్మరణం చెందారు. వివరాలివీ.. సురేంద్రగౌడు బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న శివరామకృష్ణ నగర్‌లో నివాసముంటున్నారు. బిర్లా కాంపౌండులో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం తన బ్యాంకు కార్యాలయంలో పని చేసే మెసెంజర్ రాఘవేంద్రను ఎక్కించుకుని తన బైక్‌పై హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే రోడ్డుపై వెళ్తుండగా.. అదే సమయంలో బెంగళూరు వైపు వెళ్తున్న ఓ కంటైనర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కింద పడగా.. బైక్ నడుపుతన్న సురేంద్ర గౌడు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుకాల కూర్చున్న రాఘవేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేంద్రగౌడ్ భార్య, కొడుకు, కూతురు సంతానం ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

పత్తి ధర కింటా రూ.7,641

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సోమవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,641 పలికింది. గతవారంతో పోల్చితే పత్తి ధర క్వింటానికి రూ. 150 పెరిగింది. ఖరీఫ్ సీజన్ పత్తి మొదటి కోత చేతికందడంతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. 5341 క్వింటాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4011, మధ్య ధర రూ. 7369, గరిష్ఠంగా 7641 పలికింది.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమో మారథాన్‌ను టీజీ వెంకటేశ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో తాము సిగరెట్లు, ఆల్కహాల్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని డిక్లరేషన్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగాలకు తీసుకునే సమయంలో కూడా ఈ విధానాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే వీటిని అరికట్టడం సాధ్యపడుతుందన్నారు. తన పరిశ్రమలో 3వేల మంది ఉద్యోగులకు నెలకు రూ.1,500 చొప్పున ప్రతి నెలా రూ.45 లక్షలు నాన్ ఆల్కహాల్, నాన్ స్మోకింగ్ అలవెన్సులుగా చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినూష రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేశవరాం చౌదరి, బీజేపీ నాయకుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు ప్రాధాన్యమివ్వాలి

● కాపు భవనాల నిర్మాణం చేపట్టాలి

● కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్



సమావేశంలో మాట్లాడుతున్న కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో బలిజలకు ప్రాధాన్యమివ్వాలని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్ డిమాండ్ చేశారు. అదేవిధంగా బలిజ కుటుంబంలోకి ఇతర కులాల సమూహాలను తీసుకువచ్చి తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. దొమ్మర కులస్థులను గిరి బలిజలుగా పరిగణిస్తూ విడుదల చేసిన జీవో నెంబరు 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నగరంలోని అబ్బాస్‌నగర్‌లో బలిజ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. చందు జనార్ధన్ మాట్లాడుతూ బలిజల ఓట్ల వల్ల అధికారంలోకి వస్తున్న రాజకీయ పార్టీలు ఏ రోజు వారికి సరైన పదవులు, నామినేటెడ్ స్థానాలను కేటాయించలేదన్నారు. ఉద్యోగులను సైతం అప్రాధాన్యత స్థానాలకే పరిమితం చేశారన్నారు. బలిజలకు రాజకీయ ప్రాధాన్యతతో పాటు ఉన్నత స్థానాల్లో ఉన్న ఉద్యోగులను కీలక స్థానాల్లో నియమించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాపు భవనాలను నిర్మించాలని, అపరిష్కృతంగా ఉన్న రూ.3 వేల కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు తాము సిద్ధమన్నారు. శ్రీ కృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ ప్రతినిధి సోమరాజు రామకృష్ణ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలు నమ్మి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే ఇంత వరకు పీఆర్సీ, డీఏ బకాయిలు, ఇంక్రిమెంట్లు లేవన్నారు. దీనిపై పవన్‌కల్యాణ్ మౌన నిద్ర వీడి సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు అర్జా రామకృష్ణ, కాపు, బలిజ సేవా సంఘం, అనుబంధ సంఘాల ప్రతినిధులు గాండ్ల లక్ష్మన్న, కోనేటి చంద్రబాబు, డాక్టర్ కుల్లాయప్ప, చింతపల్లి రామకృష్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.





ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

రద్దీ ప్రాంతాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్ద ప్రాంతాల నుంచి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, జీఆర్‌పీ పోలీసుల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న రైతులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే పార్సిల్ కార్యాలయాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అలాగే బస్టాండులో బస్సులను, బస్టాండులో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజరావు, నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ, టూటౌన్ ఎస్ఐ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు. డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్.1972కు సమాచారం ఇవ్వాలన్నారు.

శవంతో ధర్నా

● బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



లింగంపల్లిలో వర్షంలోనే ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

హొళగుంద, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టిన సంఘటన హొళగుంద మండలంలోని లింగంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు... లింగంపల్లికి చెందిన మారెన్న(39)ను సోమవారం పత్తి సంచులు దింపేందుకు ఈరన్న అనే వ్యక్తి ట్రాక్టరులో తీసుకెళ్లాడు. అయితే మారెన్న ప్రయాణించే ట్రాక్టర్‌కు ఉన్న ఇనుప పైప్‌కు గురుస్వామి అనే వ్యక్తి ఇంటికి తీసుకున్న విద్యుత్‌వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌తో దినకూలి మారెన్న ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు అతడిని ఆదోని ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మారెన్నకు భార్య సత్యమ్మ, కుమారుడు, కుమార్తె సంతానం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా మారెన్న పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు మారెన్న మృతదేహాన్ని పనికి తీసుకెళ్లిన యజమాని ఈరన్న ఇంటి వద్దకు తీసుకెళ్లారు. 'నీవల్లే ఇదంతా జరిగింది. న్యాయం చేయాల్సిందే..' అంటూ మృతదేహాన్ని ఇంటి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. గ్రామంలో ఆందోళనకర పరిస్థితులు తలెత్తడంతో ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి బాధితులతో ఫోన్‌లో మాట్లాడారు. అయినప్పటికీ బాధిత కుటుంబ సభ్యులు శాంతించలేదు. అర్ధరాత్రి 12 గంటలైనా మృతదేహాన్ని ఈరన్న ఇంటి ఎదుటే ఉంచి ఆందోళన చేపట్టారు.

ప్రైవేట్ పరం తగదు

● వైద్య కళాశాలలకు పీపీపీ అవసరం లేదు

● ఆ నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆదోని రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల నిర్వహణ, నిర్మాణాలు ప్రైవేట్ పరం చేయడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. 50 శాతం మెడికల్ సీట్లను అమ్ముకునేందుకు గతంలో జగన్ ప్రభుత్వం ప్లాన్ చేసిందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకొచ్చి పెద్ద పొరపాటు చేస్తోందన్నారు. సోమవారం ఆయన కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను ముట్టడించారు. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కళాశాల పనులు చివరి దశలో ఉండగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వీటిని ప్రైవేట్ పరం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. పీపీపీ ద్వారా మెడికల్ కళాశాల నిర్మాణ బాధ్యతలు ఏ బిల్డర్ తీసుకోవద్దని, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ప్రభుత్వమే చేపట్టాలన్నారు. గతంలో హైదరాబాద్‌లో ప్రైవేట్‌పరం చేపట్టిన హెచ్ఎంటి, ఐడీపీఎల్ కంపెనీలు పేదలకు ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ పరమైన పాల, చక్కెర పరిశ్రమలు కూడ అమ్మేశారన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు దాడులు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. జీఓ నంబర్ 107, 108లను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు రాధాకృష్ణ, లక్ష్మన్న, ఆనంద్ బాబు, రామన్న, లింగన్న పాల్గొన్నారు.

రైతు తలసరి ఆదాయం పెంచాలి: కలెక్టర్



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల తలసరి ఆదాయం పెంచే విధంగా ప్రైమరీ సెక్టార్లను అభివృద్ధి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖకు సంబంధించి స్వయం సహాయక సంఘాల గ్రూపులకు లైవ్ స్టాక్ ఎక్కువ మం దికి ఇప్పించేలా చర్యలు తీసుకుంటే తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యానశాఖకు సంబంధించి రైతులతో ప్రత్యామ్నాయ పంటలు వేయించాలన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించేలా అవగాహన కల్పించాలన్నారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఏపీ ఎంఐపీ పీడీని ఆదేశించారు. తడకనపల్లెలో తొలి జంతువుల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐదు గ్రామీణ నియోజకవర్గాల్లో కూడా పశువుల హాస్టల్ గృహాల ఏర్పాటుకు గుర్తించాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఇన్‌చార్జి సీపీవో భారతి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

మహానంది, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి గ్రామంలోని రెండు ఇళ్లల్లో సోమవారం పట్టపగలే చోరీ చేసిన వ్యక్తిని గ్రామస్థులు గుర్తించి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వ్యాపారి శ్రీను దుకాణంలో చోరీ చేసిన తర్వాత ప్రధాన రహదారిలో చికెన్ వ్యాపారి ఇంటిలో చోరీకి పాల్పడుతుండగా వ్యాపారి భార్య గుర్తించి కేకలు వేశారు. గ్రామస్థులు హుటాహుటినా అక్కడికి చేరి దొంగను పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధి చేశారు. ఇదే దొంగ మహానంది సమీపంలోని దేవస్థానం కాలనీలోని ఒక ఇంటిలో సోమవారం ఉదయం చోరీకి ప్రయత్నించే సమయంలో ఇంటిలోని మహిళ గుర్తించడంతో పారిపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా చోరీకి పాల్పడ్డ వ్యక్తి మతిస్థిమితం లేని వ్యక్తిగా విచారణలో గుర్తించినట్లు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మందికి గాయాలు

పాములపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెలిమిళ్ల గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం గ్రామంలో ఇంటి ముందర పనులు చేసుకుంటున్న లక్ష్మమ్మ, అయ్యమ్మ, అబ్రహాం, అనసూయబాయిలతో పాటు మరో ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసింది. అలాగే రెండు మేకలను కరచింది. దీంతో గ్రామస్థులు కర్రలతో దాడిచేసి కుక్కను చంపేశారు. గాయపడిన బాధితులు పాములపాడు, ఆత్మకూరు వైద్యశాలలో చికిత్సలు పొందారు.

ప్రాణం తీసిన ఆస్తి తగాదా



సుధాకర్ (ఫైల్)

వెలుగోడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా ఓ ప్రాణం తీసింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. మోతుకూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటశివమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిద్దరికీ ఆస్తి పంపకాలు చేశారు. అయితే రిజిస్ట్రేషన్ ఇంకా చేయించలేదు. పెద్ద కుమారుడు సుధాకర్ (36) తన వాటాకు వచ్చిన భూమి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదివారం రాత్రి తల్లితో గొడవపడ్డాడు. తనకు అనారోగ్యం ఉందని, అప్పులు ఉన్నాయని, పొలం తన పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తే, పొలం అమ్మి అప్పులు చెల్లిస్తానని తల్లి వెంకటశివమ్మతో గొడవ పడ్డాడు. ఈ నేపథ్యంలో తోపులాట జరిగి సుధాకర్ కింద పడ్డాడు. వెంటనే సుధాకర్‌ను ఆసుపత్రికి తరలిస్తూ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. అయితే తన భర్తను తన అత్త వెంకటశివమ్మ హత్య చేసిందని సుధాకర్ భార్య జ్యోతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

దొంగతనంపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తెలుగు వీధిలో ఓ ఇంట్లో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితుడు గురుస్వామి అనే వ్యక్తి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన గురుస్వామి పట్టపగలే ఇంట్లో దొంగతనం జరిగింది. సుమారు 11 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితుడు అదే రోజు పోలీసులను ఆశ్రయించగా.. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. అయితే ఇంత వరకు పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేయించి తమ బంగారు ఆభరణాలు ఇప్పించేలా చేయాలని బాధితుడు ఎస్పీని కోరారు.

అప్పుల బాధతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

ఆలూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన గరక గుండు హుస్సేన్, దాదాసాహెబ్ సోమవారం అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేశారు. హుస్సేన్‌కు, దాదాసాహెబ్ ఇద్దరూ ఇతరుల వద్ద అప్పులు చేశారు. అలాగే హుస్సేన్ కొందరి ద్వా రా దాదాసాహెబ్‌కు అప్పులు ఇప్పించారు. ఇరువురు వాదోపవాదాలు చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుస్సేన్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

శాంతించిన వరుణుడు..

- మహానందిలో తగ్గిన వరద
- పాలేరువాగుపై యథావిధిగా రాకపోకలు



బురదను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మహానంది, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మండలంలో వరుణుడు శాంతించాడు. దాంతో సోమవారం పాలేరు వాగు వరద ఉధృతి తగ్గింది. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి చొరవతో ప్రధాన రహదారిపై పేరుకపోయిన బురదను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. మహానందితో పాటు గాజులపల్లి ఆర్‌ఎస్, ఎంసీ ఫారంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల పరిసరాల్లో క్రమేపీ వరద ప్రభావం తగ్గుముఖం పట్టడంతో విద్యార్థులకు తరగతులు కొనసాగాయి. గ్రామాల్లో నెలకొన్న వరద ప్రభావంపై తహసీల్దారు రమాదేవి సర్వే చేయించారు.

ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న ధనలక్ష్మి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ హస్పిటల్ సమీపంలో నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ 10నుంచి 13 గంటల పనిచేయాలని నిబంధన పెడితే, దానికి ముఖ్యమంత్రి కూడా వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, ఏసురత్నం, మహ్మద్‌గౌస్, కార్మికులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

- ఆత్మకూరు ఉద్యాన అధికారి చందన

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లిని సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని ఆత్మకూరు ఉద్యాన అధికారిని చందన అన్నారు. సోమవారం ఆమె మండలంలోని ఎదురుపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ విజయ్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా మిడ్తూరు మండలానికి సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'నాయీబ్రాహ్మణులను కించపర్చడం సరికాదు'

ఆత్మకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులను కింపరిచేలా బాపట్ల ఎమ్మెల్యే వేగసిన నరేంద్రవర్మ రాజు మాట్లాడటం సరికాదని ఆత్మకూరు నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పగిడ్యాల శివపాములేటి అన్నారు. సోమవారం ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కులవృత్తిదారుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే తాము సహించేది లేదన్నారు. నాయకులు శివన్న, ఎల్లప్ప, స్వాములు, సుబ్బరాయుడు, వెంకటేశులు, అనిల్, రుద్రప్రసాద్ ఉన్నారు.

రాజకీయ జోక్యం తగదు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆశాల నియామకాల్లో రాజకీయ నాయకులు జోక్యం తగదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా 2వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నాగమణి, రమణకుమారి, మరో 17 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, శివమ్మ పాల్గొన్నారు.

వైభవంగా దేవీశరన్నవరాత్రులు ప్రారంభం

- ఉత్సవాలతో శోభిల్లుతున్న ఆలయాలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన దేవతామూర్తులు

శరన్నవరాత్రుల సందర్భంగా అలయాలు, మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.



ఆత్మకూరులో శ్రీశైలపుత్రీ దేవీ అలంకరణలో వాసవీ అమ్మవారు



పాణ్యం ఏఆర్ కాలనీలో బాలాత్రిపురసుందరిగా..



బండిఆత్మకూరులో రాజరాజేశ్వరీగా ..

ఆత్మకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శ్రీశైలపుత్రీ దేవీగా, చౌడేశ్వరీ అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కిషన్‌సింగ్ వీధి ధ్యానంజనేయ స్వామి, అంబాభవానీ ఆలయాల ఆవరణ, అర్బన్‌కాలనీ మెయిన్‌సెంటర్ల మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు దుర్గాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వెంకటాపురం గ్రామంలో..

ఆత్మకూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీబాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు సుందరరాజశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఏఆర్‌కాలనీలో..

పాణ్యం: మండల కేంద్రంలోని ఏఆర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్సవాలలో అమ్మవారు శ్రీదేవిగా, కనకదుర్గ ఆలయంలో రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని సరస్వతీదేవి ఆలయంలో శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభించారు. సరస్వతీ అమ్మవారు శైలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓంకార క్షేత్రంలో..

బండిఆత్మకూర: ఓంకార క్షేత్రంలో ఉమామహేశ్వరీ అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

అయ్యాలూరు గ్రామంలో..

నంద్యాల రూరల్: శ్రీదేవి నవరాత్రులను పురస్కరించుకుని నంద్యాల మండల అయ్యలూరు గ్రామంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని టీడీపీ మహిళా నాయకురాలు భైరెడ్డి శంకరమ్మ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

బుక్కాపురంలో..

మహానంది: మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

సుంకులాపరమేశ్వరి దేవి ఆలయంలో..

నందికొట్కూరు: పట్టణంలోని సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమై అమ్మవారికి విశేష అభిషేకం, పంచామృతాలతో పంచద్రవ్యములతో అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సాయి కుమార్, భాస్కర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మొదటి రోజు పతాకావిష్కారణతో నవరాత్రుల మహోత్సవాలను ఆర్యవైశ్య సంఘం, మిత్ర సంఘాల సభ్యులు ప్రారంభించారు. మొదటి రోజు బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ మిత్ర సంఘాల సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు.

గడివేములలో..

గడివేముల: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వాసవీమాత అలంకారంలో దర్శనమిచ్చారు.అంతకు ముందు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌గుప్త, ఆలయ అర్చకులు వసంతలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ఆవరణలో పతాకావిష్కరణ చేశారు.

పాములపాడులో..

పాములపాడు : మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవీ అలయంలో అమ్మవారు బాల త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. పురోహితులు కోదండరామయ్య శర్మ అమ్మవారికి కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు, మహిళలచే సాముహిక పూజలు నిర్వహించారు.

కొలనుభారతిలో..

కొత్తపల్లి: కొలనుభారతి అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో రామలింగారెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసశర్మ, చక్రపాణిశర్మ, రామయ్య శర్మలు ప్రాతకాల సమయంలో చారుగోషిణి నదిజలాలతో అమ్మవారిని అభిషేకించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, తదితర ప్రత్యేక పూజాదిక్రతువులు జరిగాయి. అలాగే సప్తశివాలయాల్లో శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు స్థానిక ఆర్యవైశ్య, కాలభైరవ ట్రస్టు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



కొత్తపల్లి: బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న కొలనుభారతి అమ్మవారు

నంద్యాల పట్టణంలో..



సంజీవనగర్ రామాలయంలో శైలపుత్రికాదేవి





కాళికాంబచంద్రశేఖరస్వామి దేవస్థానంలో దుర్గాదేవిగా.. బాలాజికాంప్లెక్స్ కళ్యాణమండపంలో కామాక్షిదేవిగా..

నంద్యాల కల్చరల్: నంద్యాల పట్టణంలో దసరా ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. సంజీవనగర్ రామాలయంలో శైలపుత్రికాదేవిగా, కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో దుర్గాదేవిగా, బ్రహ్మనందీశ్వరాలయంలో బాలత్రిపురసుందరీ దేవి, శ్రీశైలపుత్రీదేవి, బాలాజి కాంప్లెక్స్ కల్యాణమండపంలో కంచి కామాక్షిదేవిగా, అమ్మవారిశాలలో రాజరాజేశ్వరీదేవిగా, అలాగే ఆయా ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆంజనేయకోదండరామస్వామి దేవాలయంలో నాగనంది స్వామికి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, ఆంజనేయస్వామికి పురుషసూక్త శ్రీసూక్త మన్యుసూక్త విదానంతో ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోలు లక్ష్మీనారాయణ, వేణునాథరెడ్డి, భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య పాల్గొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. 2021నుంచి 2024సంవత్సరాలలో ఎంపికైన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. స్కాలర్‌షిప్స్ . జీవోవీ . ఇన్ అనే పోర్టల్‌లో విద్యార్థులు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వరకు పొడిగించినట్లు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ తెలియజేసిందన్నారు. ఈ సంవత్సరం 10, 11తరగతులు ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో సాధారణ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ రెన్యూవల్ చేసుకునేందుకు అర్హులన్నారు. వివరాలకు జిల్లా ఎన్‌ఎంఎంఎస్ నోడల్ ఆఫీసర్‌ను సంప్రదించాలన్నారు. రెన్యూవల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తన బ్యాంక్ ఖాతాకు ఆధార్ సీడ్ చేయించుకోవాలన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 22 నుంచి 26వరకు ప్రత్యేక ఆధార్‌నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీవో పద్మావతి తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో జూపాడుబంగ్లా- 1, పారుమంచాల గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ నమోదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నా రు. 25న 80బన్నూరు, తూడిచర్ల గ్రామాల్లో, 26న మండ్లెం-1, 80బన్నూరు గ్రామాల్లోని సచివాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25న మహిళలకు ఆరోగ్య పరీక్షలు

పాణ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సీహెచ్‌సీలో ఈనెల 25న స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి వేణుగోపాల్ సోమవారం తెలిపారు. వైద్య పరీక్షల్లో రక్తపోటు, మధుమేహం, క్షయ, క్యాన్సర్ తదితర వ్యాధులకు స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వయో వృద్ధులకు, కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు.

ఆర్జీఎంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

పాణ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఈసీఈ ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌వోడీ సోఫియాప్రియదర్శిని తెలిపారు. భారతదేశంలోని వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 65 బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయన్నారు. హ్యాకథాన్‌లో ప్రథమ విజేతగా నిలిచిన వజ్ర బృందానికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ రామిరెడ్డి, ఎస్‌పీవోసీ గోపికృష్ణారావు పాల్గొన్నారు.

యూరియా పంపిణీని అడ్డుకున్న రైతులు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యూరియా అధికార పార్టీ అనుచరులకే అందుతుందని, తమకు ఏ మాత్రం దక్కటం లేదని జీ లింగాపురం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంపిణీని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని 307 మందికి టోకెన్లు అందజేశారు. దీంతో రైతులు శాంతించారు.

ఫెన్సింగ్ క్రీడాకారిణికి సన్మానం



శ్రేయను సన్మానిస్తున్న ఎన్‌ఎండీ ఫిరోజ్, ఆర్యవైశ్యులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి పబ్బతి చిన్మయిశ్రేయను పలువురు ప్రశంసించారు. సోమవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బింగుమళ్ల శ్యాంసుందర్‌గుప్త, చంద్రశేఖర్, శ్రీనివాసదత్తాత్రేయశేఖర్ చిన్మయిశ్రేయను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసియా ఫెన్సింగ్ కేడెట్ కప్పులో 26వ ర్యాంక్ సాధించి దేశంలోనే ఉత్తమ క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుందన్నారు. శిక్షణ ఇచ్చిన కోచ్ లక్ష్మణ్‌ను అభినందించారు.

నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్

లక్ష్యాలు సాధించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర -2047లో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో యాక్షన్‌ప్లాన్‌పై వివిధ శాఖల అధికారులు, యంగ్ ప్రొఫెషన్స్ జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు, యంగ్‌ప్రొఫెషనల్స్ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా అగ్రికల్చర్, హార్టికల్చర్, టూరిజం రంగాల్లోన్ని వనరులను వినియోగించుకుని జీడీపీ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇండస్ట్రియల్ సెక్టార్‌లో జిల్లా మొదటి స్థానంలో నిలవాలంటే ప్రతి మండలంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ, డీఆర్డీ, ఏపీడీ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపాం

పాములపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కాల గ్రామ శివారులోని భవనాశి వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని పంచాయతీ రాజ్ డీఈ ఈరన్న తెలిపారు. సోమవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామిలతో కలిసి భవనాశి వాగు పరిసరాలను పరిశీలించారు. ఏఈ వాహిద్ సాహెబ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని నియమించాలని సీపీఎం నాయకులు నక్కస్వాములు, దినేష్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణకు వినతి పత్రం అందజేశారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ

- డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావు నాయక్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావు

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను నివారించవచ్చని నంద్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావు నాయక్ సూచించారు. సోమవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన వైద్యాధికారి మహ్మద్ బేగ్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాంతారావు నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ మూడు రకాలుగా ఉంటుందని, అందులో బ్రెయిన్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, నోటి క్యాన్సర్లు ఉంటాయన్నారు. వీటి వల్ల భయపడాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను తరిమికొట్టవచ్చాన్నారు. అనంతరం రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వైద్యాధికారులు లక్ష్మి ప్రసన్న, దీపా నాగవేణి, గుల్లా ఎంపీడీవో మేరీ, జడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, బీజేపీ జిల్లా కార్యదర్శి అగస్త్యం శంకర్ గౌడు క్యాన్సర్ పై ప్రజలకు పలు సూచనలు చేశారు. సమావేశంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, సంచార ప్రోగ్రాం అధికారి జగదీష్ చంద్రారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గా చేపట్టాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

ఆత్మకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో చేపట్టబోవు డీఎస్సీ నియామకాలను వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీ.హృదయరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరులోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్ అధ్యక్షతన 136 మంది డీఎస్సీ సెలెక్టెడ్ టీచర్లను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరులోని స్నేహ కోచింగ్ సెంటర్ ద్వారా 136 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం హర్షనీయమన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న పీఆర్‌సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని అన్నారు. 12 న సవరణ కమిషన్‌ను నియమించి నివేదిక వచ్చే లోపల 30శాతం మధ్యంతర భృతి ప్రకటించి అమలు చేయాలని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మాధవస్వామి, మరియానందం, శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలను బంద్ చేయించి పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6,400 కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్ రూపంలో విద్యార్థులకు ప్రభుత్వం బకాయి పడిందని, వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం ఫీజులు చెల్లించలేదనే నెపంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే వామపక్ష విద్యార్థి సంఘాలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్యాం నాయక్, సూరి, శివ, అంజి, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ నాయకులు వినుకొండ కృపవరం, ఎతఈ రామయ్య ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నంద్యాల టెక్క విద్యుత్ కార్యాలయంల నుంచి సాయిబాబానగర్ మీదుగా నూనెపల్లె మీదుగా కలెక్టరేట్ చేరుకుంది. కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీరాములు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసి వితంతవులు, దివ్యాంగులు, వృద్ధులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు గ్రాబ్రియేల్, భాస్కర్ గౌడ్, రామకృష్ణ, సుధాకర్, మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, మల్లమ్మ, ముర్తుజాబి తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో పల్లకీ సేవ


పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పల్లకీసేవ ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. కార్యక్ర మంలో ఆలయ ఈవో పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా అధికారుల తనిఖీలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని పలు ఆహార పదార్థాల విక్రయ దుకాణాలను జిల్లా ఆహార భద్రతా అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఆహార భద్రతా అధికారి వెంకటరాముడు ఆధ్వర్యంలో పట్టణంలోని చింతకుంట, ఆర్టీసి బస్టాండ్ ఎదుట, పాతబస్టాండ్ తదితర ప్రాంతాలో నిర్వహిస్తున్న ఆహార విక్రయ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు యజమానులకు నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారి ఖాశీంవలి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని కాళిమాత ఆలయంలో అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ దురగడ్డ రవీంద్రాచారి ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నేరవేరుస్తామన్నారు. విశ్వబ్రాహ్మణులను అందరిని ఒక తాటిపై తీసుకొని వచ్చి వారి అభివృద్ధికి సంక్షేమానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసచారి, నియోజకవర్గంలోని పలు మండలాల సంఘం నాయకులు, కాళిమాత ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

రుద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రుద్రవరం పోలీసు స్టేషను పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు పట్టుబడ్డారు. వీరిని ఆళ్లగడ్డ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున సోమవారం జరిమానా విధించినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు. టి.లింగందిన్నెకు చెందిన మందలూరు నాగశేషు, ఆర్.నాగలవరం గ్రామానికి చెందిన ముని స్వామిలకు జరిమానా విధించినట్లు తెలిపారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

వివిధ అలంకారంల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి శాలలో దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ఆలయ ఆవరణలో ఊరేగించారు.

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీమాత ఆలయంలో సోమవారం అమ్మవారు శైలపుత్రీదేవి మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, పీవీ. నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. అలాగే బనగానపల్లె పట్టణంలో కొండపేటలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మ వారు శైలపుత్రిదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



బేతంచెర్ల: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మ వారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారి శాలలో సోమవారం ఉదయం కలశస్థాపన, రుద్రాభిషేకం, సోడాపచార పూజలు, నవగ్రహ పూజలు చేశారు.

వాసవీ మాతాకు సామూహిక కుంకుమార్చన: పట్టణంలో అమ్మవారిశాలలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి ఆర్యవైశ్య దంపతులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవీ అలంకారంలో భక్త లకు దర్శనమిచ్చారు. మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శిం చుకున్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొర్విమానుపల్లె పెద్దమ్మ ఆలయం, తిమ్మనాయినిపేట, బెలుం, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, పెట్నికోట తదితర గ్రామాల్లోని ఆల యాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని అమ్మవారిశాలలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకధారసునిల్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

సంజామల: సంజామల వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి కిరణ్ కుమార్ అమ్మవారికి మొదటి పూజ చేశారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండే కంటి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్యులు పాల్గొని పూజలు చేశారు.

డోన్ రూరల్: పట్టణంలోని పాతబస్టాండులో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

అవుకు: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు తాళేపల్లె నాగేంద్రకుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు వాసవీమాతకు పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు 101 కలశ బిందెలతో నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం వాసవీమాత రాజరాజేశ్వరి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు సుబ్బనాగభూషణం, మల్లెల ఆంజనేయులు, నరసింహప్రతాప్, సూర్యనారాయణ, బొగ్గరపు రామాంజనేయులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి ఆలంకా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ప్యాపిలి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి స్వర్ణకవచాలంకృత అలంకరణలో, అంకాల పరమేశ్వరిదేవి శైలపుత్రదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు భక్తులు పూజలు చేశారు.

రుద్రవరం: రుద్రవరంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగం గా మొదటిరోజు అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

డోన్ టౌన్: డోన్ పట్టణంలో కనకదుర్గమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిశాల అధ్యక్షుడు కోట్రికే హరికిషన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు వాసవి మాతకు అర్చకుడు శేషస్వామి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.


ముత్యాలపాడులో కలశాలతో గ్రామోత్సవం చేస్తున్న ఆర్యవైశ్యులు


అవుకులో కలశ బిందెలతో నీటిని తెస్తున్న ఆర్యవైశ్య మహిళలు, డోన్‌లో దుర్గామాతను దర్శించుకుంటున్న మున్సిపల్ కమిషనర్, బీజేపీ నాయకులు

దుర్గామాతకు పూజలు

డోన్ పట్టణంలోని దళితవాడలో సోమవారం దుర్గామాత విగ్ర హాన్ని ప్రతిష్ఠించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మున్సిపల్ కమి షనర్ ప్రసాద్‌గౌడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, డోన్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు బద్రి సుధా కర్, సుబ్రహ్మణ్యం, రాజారెడ్డి, మధు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా కలశ స్థాపన మహోత్సవం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాల్లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశ స్థాపన మహోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముత్యాలపాడులో మహిళలు నదీ జలాల కళశాలతో ఆలయ అధ్యక్షుడు ఎం.నరసిం హరావు, మాధవ నరసింహయ్య ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిం చారు. రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు.


బేతంచెర్ల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, శిరివెళ్ల, సంజామల, డోన్‌లో బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు


రుద్రవరంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు


ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, దొర్నిపాడు, డోన్, చాగలమర్రిలో రాజరాజేశ్వరీ దేవీ అలంకారంలో అమ్మవారు


బనగానపల్లెలో శైలపుత్రిగా..


ప్యాపిలిలో స్వర్ణకవచాలంకృత అలంకారంలో అమ్మవారు

అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గం లోని ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన కె.రాంపుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం డోన్ ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో నరసింహులుకు ఆయన అర్జీ సమర్పించారు. రాంపుల్లయ్య మాట్లాడుతూ గార్లదిన్నె గ్రామంలో ఎన్‌ఆర్ఈజీఎస్ నిధులు సర్పంచ్ నిధులు దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. గ్రామంలో చుక్కల, ప్రభుత్వ మిగులు భూ ముల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. గ్రామంలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంటు నిర్మాణానికి వచ్చిన బిల్లుల్లో కూడా అక్రమాలు జరిగాయని, వీటన్నింటిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి: సీపీఐ

ప్యాపిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. మహేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు చాలిచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రూ.10లక్షలు బీమా కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దారు భారతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డోన్ రూరల్: ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్ల కనీస వేతనం పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు అన్వర్, ఉమా, హుశేన్, సుశీలమ్మ, కవిత, ఫాతిమా పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

జీఎస్టీలో సంస్కరణలు పేద, మధ్య తరగతికి వరం

బనగానపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతికి వరమని బీజేపీ జిల్లా కార్యదర్శి శివకృష్ణ యాదవ్, శరత్ చంద్రగుప్త అన్నారు. సోమవారం బనగాపల్లె ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదగిరి, హరికృష్ణగౌడ్, టీ.ప్రసాద్, మోహార్, శివ, గాండ్ల లక్ష్మయ్య, సుబ్బయ్య, మల్లయ్య, సుబ్బరాయుడు, హుసేన్‌వలి పాల్గొన్నారు.

రుద్రవరం తహసీల్దార్‌గా ఆల్‌ఫ్రెడ్

రుద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రుద్రవరం తహసీల్దార్‌గా ఆల్‌ఫ్రెడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లోని సమస్యలు తమ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకరావాలన్నారు. తహసీల్దారును రెవెన్యూ సిబ్బంది పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దొరపల్లె ప్రాంతంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్‌లతో కలిసి పీజీఆర్ఎస్ వేదికలో డోన్ ఆర్డీవో నరసింహులుకు వినతి పత్రం సమర్పించారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీమునిపాడు సొసైటీ పరిధిలోని రైతులందరికీ యూరియా అందిస్తామని ఛైర్మన్ అరికెట్ల సునీల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీమునిపాడు సొసైటీలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏవో సుధాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. సునీల్‌రెడ్డి మాట్లాడారు. ఎస్‌డీఎల్‌సీవో ప్రభాకర్‌రావు, సొసైటీ సీఈవో మనో హర్‌రెడ్డి, సొసైటీ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసీల్దారు ప్రసాద్‌బాబు బీఎల్‌వోలను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలతో తహసీల్దార్ సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2022 ఓటరు జాబితాకు, ప్రస్తుత 2025 ఓటరు జాబితాలో తేడాలు గుర్తించి సరిచేయాలన్నారు.

'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు'

బనగానపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు సోమవారం పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా ర్థులకు మొక్కల పంపిణీ చేశారు. మద్దయ్య, మద్ది లేటి, శ్రీను, సాలయ్య, వాకింగ్ మిత్రబృందం పాల్గొన్నారు.

బాధితులకు నగదు, కిట్ల పంపిణీ

చాగలమర్రి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో భారీ వర్షాలకు మట్టిమిద్దె కూలి నిరాశ్రయులైన దూదెకుల దస్తగిరి కుటుంబానికి సోమవారం ఆళ్లగడ్డ, చాగలమర్రికి చెందిన దూదెకుల సంఘ నాయకులు రూ.10 వేలు నగదు, నిత్యావసర కిట్లను అందజేశారు. దూదెకుల సంఘం నాయకులు ఖాసీం వలి, బ్రహ్మయ్య, లాలయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించడమే లక్ష్యం

రుద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందరికీ ఆరోగ్యం అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుదర్శన్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని నరసాపురం ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్యాధికారులు బాబు, జయలక్ష్మి పాల్గొన్నారు.

బిల్లును ఉపసంహరించుకోవాలి: సీఐటీయూ

బేతంచెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఆమోదించిన 13 గంటల పని విధానం బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ నాయకులు రామాంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి మదు శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్టాండులో నిరసన తెలిపారు.

వైద్య శిబిరం

బనగానపల్లె, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యునాని వైద్యశాలలో డాక్టర్ షబానా ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆస్పత్రిలో స్వస్త్ నారీసశక్త్ పరియార్ అభియాన్ పథకం కింద మహిళలకు గైనిక్ సమస్యలు, డయాబెటిస్, బీపీ, మోనోపాజ్, గ్యాస్ సంబంధిత వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద డాక్టర్లు శ్రీవాణి, శ్రీదేవిలు మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు విద్యా సాగర్, జగదీష్, గౌస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ యజమానులకు నోటీసులు

బేతంచెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో అనధికారికంగా లేఅవుట్లు వేసిన యజమానులకు రెండో సారి నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ సెక్రటరీ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, బంజరుభూమిని నివాస స్థలంగా మార్చిన చింతనాగిరెడ్డి, బి.మధు, నాగరాజు, వెంకటేశ్వర్లు, జులకంటి రెడ్డి, వెంకట్ మోహన్‌బాబు, బోయ శ్రీనివాసులు శివశంకర్, జక్కాజ్యోతి, దూదేకుల దస్తగిరిలకు రెండోసారి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. వీరు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోకుండా, టౌన్ కంట్రి ప్లానింగ్ పట్టణ అభివృద్ధి సంస్థ వారి సాంకేతిక అనుమతి పొందకుండా లేఅవుట్ వేశారని ఆయన తెలిపారు. ఈ నోటీసు అందిన 7 రోజుల్లోపు లేఅవుట్ వేసి స్థలంలో రాళ్లు, కంప చెట్లు తొలగించాలని తెలిపారు.

పరిశుభ్రత కోసం కృషి చేయండి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పచ్చదనం.. పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ మీనాక్షి సుందరం, ఏవీపీ సూర్యకాంత్ హీరీమేత్ అన్నారు. సోమవారం ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాల మేరకు పరిశ్రమ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్ర మంలో భాగంగా ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అజ్మల్‌అహ్మద్ పాల్గొన్నారు.

బుగ్గన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి: టీడీపీ

బేతంచెర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగి విజయవాడకు చంద్రబాబు వద్దకు బయలుదేరారని బుగ్గన అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. అసెంబ్లీ సమావేశాల మధ్య సీఎం చంద్రబాబు ఉండటం వల్ల టీడీపీ నాయకులను అపాయింట్‌మెంట్ దొరక్క ఇబ్బంది పడుతున్నారని అనడం ఎంత వరకు సమంజసం అన్నారు. సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే టీడీపీ లక్ష్యమన్నారు. టీడీపీ నాయకులు నాగరాజు, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొలుములపల్లె నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.